# ఆ మాటలు విని రజనీకాంత్ కన్నీళ్లు పెట్టుకున్నారు



తమిళ సూపర్‌స్టార్ రజనీకాంత్ కుమార్తె ఐశ్వర్య దర్శకత్వం వహించిన చిత్రం 'లాల్ సలామ్'. విష్ణు విశాల్ హీరోగా నటించగా.. రజనీ అతిథి పాత్ర పోషించారు. చెన్నైలో జరిగిన ఈ సినిమా ఆడియో విడుదల కార్యక్రమంలో ఐశ్వర్య.. రజనీపై వస్తోన్న ట్రోల్స్ గురించి మాట్లాడారు.

"సోషల్ మీడియాకు నేను చాలా దూరంగా ఉంటా. ఆన్‌లైన్ నెగెటివిటీ గురించి నా టీమ్ తరచూ చెబుతుంటుంది. వాటి వల్ల నేను ఆగ్రహానికి గురైన సందర్భాలున్నాయి. మేమూ మనుషులమే. మాకు మనసు, భావోద్వేగాలు ఉంటాయి. ఈ మధ్య కాలంలో నా తండ్రిని 'సంఘీ' అంటూ విమర్శలు చేస్తున్నారు. ఏదైనా రాజకీయ పార్టీకి మద్దతు ఇచ్చేవారిని అలా పిలుస్తారని తెలుసుకున్నా. రజనీకాంత్ సంఘీ కాదు. అలా అయితే.. ఆయన 'లాల్ సలామ్'లో నటించేవారు కాదు" అని పేర్కొన్నారు. ఐశ్వర్య మాటలు విన్న రజనీకాంత్ కన్నీళ్లు పెట్టుకున్నారు.

ఇదే వేదికగా రజనీకాంత్ మాట్లాడుతూ.. "జైలర్' ఈవెంట్‌లో భాగంగా 'అర్థమైందా రాజా' అంటూ నేను చేసిన వ్యాఖ్యలను కొంతమంది తప్పుగా అర్థం చేసుకున్నారు. విజయ్‌పై పరోక్షంగా మాటల దాడి చేశానన్నారు. అవి నన్నెంతో బాధించాయి. అతడు నా కళ్ల ముందు పెరిగాడు. టాలెంట్, పట్టుదలతో ఈ స్థాయికి వచ్చాడు. నాకు ఎవరితోనూ పోటీ లేదు. నాకు నేనే పోటీ. మా అభిమానులకు చెప్పేది ఒక్కటే.. మమ్మల్ని పోల్చి చూడొద్దు. 'లాల్ సలామ్' కథ విన్న వెంటనే యాక్ట్ చేయాలని నిర్ణయించుకున్నా. విష్ణు అద్భుతంగా నటించాడు. ఈ సినిమా చూశాక చిత్ర సంగీత దర్శకుడు రెహమాన్.. ఐశ్వర్యను ఎంతగానో మెచ్చుకున్నారు. సినిమా తప్పకుండా విజయం సాధిస్తుంది" అని అన్నారు.

# అ సినిమాపై రాధిక ఆగ్రహం

ఒక సినిమాపై అసహనం వ్యక్తం చేస్తూ నటి రాధిక శరత్‌కుమార్ తాజాగా ఎక్స్ (ట్విటర్)లో పోస్ట్ పెట్టారు. "ఏదైనా సినిమా చూసి మీరు విసిగిపోయారా? నాకు అయితే ఒక చిత్రాన్ని మధ్యలోనే ఆపేయాలనిపించింది. చాలా ఆగ్రహంగా ఉంది" అని ఆమె రాసుకొచ్చారు. ఇది నెట్టింట వైరల్‌గా మారింది. దీనిపై నెటిజన్లు పలు రకాలుగా స్పందిస్తున్నారు. రాధిక మాట్లాడుతున్నది తాజాగా ఓటీటీలో విడుదలైన 'యానిమల్' గురించేనని భావిస్తున్నారు. "మీరు మాట్లాడుతున్నది 'యానిమల్' గురించే కదా" అంటూ కామెంట్స్ పెడుతున్నారు. రణ్‌బీర్ కపూర్,



రష్మిక నటించిన 'యానిమల్'కు సందీప్ రెడ్డి వంగా దర్శకత్వం వహించారు. అంతటా భారీ వసూళ్లు రాబట్టినప్పటికీ.. సినిమాలోని చాలా సన్నివేశాల్లో హింసను తీవ్రస్థాయిలో చూపించారని పలువురు విమర్శలు చేశారు. కొన్ని సన్నివేశాల్లో స్త్రీని తక్కువ చేసి చూపించారంటూ సినీ విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తంచేశారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఇది నెట్‌ఫ్లిక్స్‌లో విడుదలైంది. ఈ క్రమంలోనే రాధిక ట్వీట్ చేయడంతో ఆమె మాట్లాడుతున్నది దీని గురించేనని పలువురు నెటిజన్లు సందేహం వ్యక్తం చేస్తున్నారు. అయితే, రాధిక మాత్రం తాను ఏ చిత్రం గురించి మాట్లాడుతున్నదనేది మాత్రం చెప్పకపోవడం గమనార్హం.

# సినిమాను దేవాలయంగా భావిస్తున్నారు



ప్రశాంత్ వర్మ దర్శకత్వంలో ఆయన సినిమాటిక్ యూనివర్స్ నుంచి వచ్చిన ఫస్ట్ ఇండియన్ ఒరిజినల్ సూపర్ హీరో చిత్రం 'హను-మాన్'. తేజ సజ్జా హీరోగా ప్రైమ్‌షో ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై కే నిరంజన్‌రెడ్డి నిర్మించారు. సంక్రాంతి కానుకగా ప్రపంచవ్యాప్తంగా విడుదలైన ఈ చిత్రానికి చక్కటి ఆదరణ లభిస్తున్నది.

ఈ నేపథ్యంలో చిత్ర యూనిట్ శనివారం గ్రాటిట్యూడ్ మీట్ నిర్వహించింది. దర్శకుడు ప్రశాంత్ వర్మ మాట్లాడుతూ.. నిరంజన్ గారి లాంటి నిర్మాత దొరకడం మా అదృష్టం. 'హను-మాన్' విజయం ప్రేక్షకులదే. ఎన్నో క్లోజింగ్ థియేటర్స్ ఈ సినిమాతో ఓపెన్ కావడం ఆనందాన్నిచ్చింది. మూడో వారంలోనూ హౌస్‌ఫుల్ బోర్డు చూడటం మేకర్స్‌కి గొప్ప తృప్తినిస్తుంది. ఈ సినిమా ఇంకా చాలా రోజులు ఆడుతుంది. 'హను-మాన్'కు చాలా వేడుకలు చేయనున్నాం. ఈ సినిమాకు పనిచేసినవాళ్లందరికి గిఫ్ట్స్ ఉండబోతున్నాయి. ప్రేక్షకులు 'హను-మాన్' సినిమాను చూస్తూ థియేటర్లను దేవాలయాలుగా భావిస్తున్నారు. సినిమా చూస్తున్న ప్రతి ఒక్కరూ అయోధ్య ఆలయానికి ఐదు రూపాయలు విరాళం చేస్తున్నారు. ఈ సినిమా లాభాలను దేవుళ్లకు, సినిమాలు తీయడానికే ఖర్చు పెడతాం. ఈ చిత్ర సీక్వెల్ 'జై హనుమాన్'తో అందరి రుణం తీర్చుకోబోతున్నాను. 'హను-మాన్' కన్నా 'జై హనుమాన్' వందరెట్లు గొప్పగా ఉంటుంది. ఇంటర్నేషనల్ సినిమా చేయడానికి ప్రయత్నిస్తున్నాం' అన్నారు. హీరో తేజ మాట్లాడుతూ 'సినిమాను ఆదరించిన ప్రేక్షకులకు పాదాభివందనం' అని అన్నారు.



## 'ఆదిపురుష్'.. ఆ సీన్స్ నన్ను బాధించాయి: ప్రశాంత్ వర్మ

హను-మాన్‌తో మరో విజయాన్ని తన ఖాతాలో వేసుకున్నారు దర్శకుడు ప్రశాంత్ వర్మ. ఈ సినిమా సక్సెస్‌లో భాగంగా హిందీ మీడియాకు ఆయన ఇంటర్వ్యూ ఇచ్చారు. 'ఆదిపురుష్'పై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. అందులోని కొన్ని సన్నివేశాలు తనకెంతో నచ్చాయని అన్నారు.


"ఆదిపురుష్'లోని కొన్ని సన్నివేశాలు నాకెంతో నచ్చాయి. వాటిని తెరకెక్కించిన తీరు నన్ను ఆశ్చర్యపరిచింది. అయితే, కొన్ని సీన్స్ తీర్చిదిద్దిన తీరు నాకేమాత్రం నచ్చలేదు. నేనే అయితే వాటిని ఇంకా బాగా చేసేవాడిని కదా అనిపించింది. నాకే కాదు.. ఏ ఫిల్మ్ మేకర్‌కైనా ఆ భావన కలుగుతుంది. ఆ సినిమా ఫలితం నాపై ఎలాంటి ప్రభావం చూపించలేదు. టీమ్ అందరి సహకారంతో నేను అనుకున్నవిధంగా 'హను-మాన్'ను తెరకెక్కించగలిగా." అని చెప్పారు.

# మెగా కోడలా.. మజాకా..



లావణ్య త్రిపాఠి, వరుణ్ ప్రేమించి పెళ్లి చేసుకున్న విషయం తెలిసిందే. అయితే.. ఏనాడో ప్రేమలో పడ్డ ఈ జంట.. వారి ప్రేమ వ్యవహారం బయటికి పొక్కకుండా చాలా జాగ్రత్తలు తీసుకున్నారు. ఒక్కసారంటే ఒక్కసారి కూడా మీడియా కెమెరాలకు వీరిద్దరూ చిక్కకపోవడం నిజంగా గ్రేట్. ఏదిఏమైనా పెద్దల అంగీకారంతో ఇద్దరూ పెళ్లాడేశారు. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో ఆసక్తికరంగా తన పెళ్లి ముచ్చట్లను చెప్పుకొచ్చారు మెగా కోడలు లావణ్య త్రిపాఠి. ఈ సందర్భంలో 'ఇంతకీ ఆడపడుచు కట్నం ఎంతిచ్చారేంటి?' అని యాంకరమ్మ ఆడిగిన ప్రశ్నకు లావణ్య సమాధనమిస్తూ.. 'తనకు నేనేం ఇవ్వలేదు. తను మా ఇంటి పిల్ల. కావాలంటే తనకు ఏమైనా ఇస్తాను. ఈ మధ్య నిహారిక సొంతగా ప్రొడక్షన్ స్టార్ట్ చేసిందికదా.. మంచి కథ ఉంటే తన బ్యానర్‌లో పైసా తీసుకోకుండా నటిస్తాను కూడా' అంటూ చెప్పుకొచ్చారు లావణ్య త్రిపాఠి. లావణ్య సమాధానం విన్న మెగాఫ్యాన్స్.. 'మెగా కోడలా మజాకా..' అంటూ కితాబులిచ్చేస్తున్నారట.

# మీరుంటే చాలు!



'టైమ్ వచ్చినప్పుడు అస్సలు టైమ్ ఉండదు..' సినీజనాలకు బాగా వర్తించే డైలాగ్ ఇది. సక్సెస్‌లో ఉన్న యాక్టర్లకు తీరిక ఉండదు. కాల్‌షీట్లు హాట్ కేకుల్లా అమ్ముడవుతుంటాయి. ఇప్పుడు ఈ సూత్రం ఓటీటీ యాక్టర్లకు మరింత అన్వయం అవుతుంది. ఓటీటీలో సత్తాచాటుతున్న నటుల కోసం నిర్మాణ సంస్థలు క్యూ కడుతున్నాయి. 'మీకు టైమ్ ఉన్నప్పుడే ప్రాజెక్టు మొదలుపెడతామ'ని ఓటీటీ స్టార్లను బతిమాలుకుంటున్నాయి. ఓటీటీ వచ్చినప్పుడు 'ఫోన్‌లో ఎంతమంది చూస్తారు?' అనుకున్నారు. కానీ, ఇప్పుడు ఓటీటీ కంటెంట్‌కే మా ఓటు అంటున్నారు ప్రేక్షకులు. ఇక్కడ హిట్టయిన నటులు.. సినిమా అవకాశాలు వచ్చినా ఓకే చెప్పలేనంత బిజీ అయిపోయారు. మనోజ్ బాజ్‌పాయ్, షెఫాలీ షా, పంకజ్ త్రిపాఠి తదితర నటుల కాల్‌షీట్ల కాస్ట్ అమాంతం పెరిగిపోయింది. ఒక్కో కాల్షీట్‌కు రూ.7 లక్షల వరకు డిమాండ్ చేస్తున్నారట. మొత్తంగా ఒక వెబ్‌సిరీస్‌కు రూ.3 కోట్ల నుంచి రూ.5 కోట్లు తీసుకునే రేంజ్‌కు చేరుకున్నారు.

# సమర యోధురాలి పాత్రలో..



అగ్ర కథానాయిక శృతిహాసన్ పట్టిందల్లా బంగారమవుతున్నది. ఈ భామ నటించిన సినిమాలన్నీ విజయం సాధిస్తుండటంతో అదృష్ట నాయిక అంటూ అభిమానులు సంబరపడిపోతున్నారు. గత ఏడాది తెలుగులో వీరసింహారెడ్డి, వాల్తేరు వీరయ్య, సలార్, హాయ్ నాన్న సినిమాలు ఈ అమ్మడికి మంచి విజయాలను అందించాయి. ఈ నేపథ్యంలో కథల ఎంపికలో మరింత వైవిధ్యానికి ప్రాధాన్యత ఇవ్వాలని నిర్ణయించుకుందట శృతిహాసన్. తాజా సమాచారం ప్రకారం తమిళంలో 'వేలు నాచ్చియార్' అనే వీర వనిత పాత్రలో నటించబోతున్నదట. స్వాతంత్ర్య సంగ్రామంలో పాల్గొన్న ధీర వనితగా తమిళనాట వేలు నాచ్చియార్ ప్రసిద్ధికెక్కింది. కథలోని దేశభక్తి అంశాలు, తన పాత్రలోని ధీరత్వం నచ్చడంతో ఈ సినిమాకు శృతిహాసన్ ఓకే చెప్పిందని తమిళ సినీ వర్గాల్లో వినిపిస్తున్నది. ఇప్పటివరకు ఎక్కువగా గ్లామర్ రోల్స్‌లోనే కనిపించిన ఈ అమ్మడు తొలిసారి స్వాతంత్ర్య పోరాట నేపథ్య కథలో నటిస్తుండటం ప్రాధాన్యతను సంతరించుకుంది. దాదాపు నాలుగేళ్ల విరామం తర్వాత మాతృభాష తమిళంలో శృతిహాసన్ నటించబోతున్న చిత్రమిదే కావడం విశేషం.



# బహుముఖ ప్రతిభకు తార్కాణం

## హర్షివ్ కార్తీక్

తెలుగు సినిమాలో తనదైన ముద్ర వేయడానికి సిద్ధమౌతున్నారు హర్షివ్ కార్తీక్. తను ప్రధాన పాత్ర పోషించడంతో పాటు రచన, నిర్మాణం, దర్శకత్వం వహిస్తున్నారు. 'బహుముఖం' అనే ఈ చిత్రానికి గుడ్, బ్యాడ్ & యాక్టర్ అనేది ట్యాగ్‌లైన్. సస్పెన్స్ డ్రామా థ్రిల్లర్ గా తెరకెక్కుతున్న ఈ చిత్రం అట్లాంటా, మాకాన్, కాంటన్, జార్జియా, యుఎస్ఏ పరిసర ప్రాంతాలలో చిత్రీకరణ జరుపుకుంది. స్వర్ణిమా సింగ్, మరియా మార్టినోవా ఈ చిత్రంలో కథానాయికలు. క్రిస్టల్ మౌంటైన్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై రూపొందిన ఈ చిత్రానికి అరవింద్ రెడ్డి సహ నిర్మాత. ల్యూక్ ఫ్లెచర్ సినిమాటోగ్రాఫర్ కాగా, శ్రీచరణ్ పాకాల బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందించారు. రామస్వామి, హర్షివ్ కార్తీక్ డైలాగ్స్ అందించిన ఈ చిత్రానికి ఫణి కళ్యాణ్ సంగీతం సమకూరుస్తున్నారు. హర్షివ్ కార్తీక్, గ్యారీ బిహెచ్‌తో పాటు ఎడిటింగ్ కూడా నిర్వహిస్తున్నారు!!